సాక్షి వికారాబాద్

బుధవారం । 12 । మార్చి । 2025




కల్యాణం.. కమనీయం

పరిగి పట్టణంలో వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించారు. 10లో▸



రెవెన్యూ డివిజన్ చేయాలి

పరిగి నియోజవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని టీజేఏసీ జిల్లా చైర్మన్ ముకుందనాగేశ్వర్ కోరారు. 10లో▸



న్యూస్‌రీల్

17న ఆలయ భూములకు కౌలు వేలం

ఈఓ నరేందర్

మోమిన్‌పేట: మండలంలోని ఆలయ భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 17న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోమిన్‌పేటలోని బాలజీ, మాణిక్ ప్రభు, విఠలేశ్వర స్వామి ఆలయ భూములను మూడు సంవత్సరాలపాటు సాగు చేసుకునేందుకు కౌలుకు ఇస్తామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనాలనుకునే రైతులు రూ.3 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 11గంటలకు మాణిక్ ప్రభు ఆలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గ్రూప్ -2 ఫలితాల్లో మెరిసిన తిర్మలాపూర్ వాసి

26వ ర్యాంక్ సాధించిన రాఘవేందర్ గౌడ్



కుల్కచర్ల: తెలంగాణ గ్రూప్ -2 పరీక్ష ఫలితాల్లో కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రాఘవేందర్ గౌడ్ 26వ ర్యాంక్ సాధించారు. మంగళవారం మధ్యాహ్నం టీజీపీఎస్సీ గ్రూప్-2 ఫలితాలను విడుదల చేసింది. తిర్మలాపూర్‌కు చెందిన బల్ల రవీందర్ కుమారుడు రాఘవేందర్ ఉత్తమ ర్యాంక్ సాధించారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

హామీలు అమలు చేయాలి

హామీలు అమలు చేయాలి

దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

పరిగి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా హామీలను అమలు చేయడం లేదన్నారు. పింఛను మొత్తాన్ని వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులకు రూ.4వేలు ఇవ్వాలని కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

రూ.1.10 లక్షల నగదు అందజేసిన సబ్ డివిజన్ పోలీసులు



రవీందర్ భార్యకు నగదు అందజేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తదితరులు

తాండూరు టౌన్: గుండెపోటుతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి సబ్ డివిజన్ పోలీసులు ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.1.10 లక్షల నగదు అందజేశారు. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే కావలి రవీందర్ ఆరు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు ఎదురైనా తోడుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో తాండూరు రూరల్ సీఐ నగేష్, ఎస్సైలు గిరి, విఠల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పెద్దేముల్ పోలీసులు మాసయ్య, ముంతాజ్, పర్వీన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ కేటగిరి-2 పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించారు. రూ.2000 అపరాధ రుసుముతో ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 11తో గడువు ముగియగా విద్యార్థుల విజ్ఞప్తి మేరకు తేదీ పొడిగించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్-2025కు ఇంత వరకు 9500 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

మిగిలింది 20 రోజులే..

- ఈ నెల చివరి నాటికి ముగియనున్న ఉపాధి హామీ పనుల గడువు
- జిల్లాకు మంజూరైన పనులు 811
- ఖర్చు చేయాల్సిన నిధులు రూ.54.28 కోట్లు
- ఇప్పటి వరకు పూర్తి చేసింది 50శాతమే



ధారూరులో పూర్తయిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ ఉమేశ్ తదితరులు

వికారాబాద్: జిల్లాలో ఉపాధి హామీ పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా కనిపించడం లేదు. 2024 – 25 ఆర్థిక సంవత్సరం మరో 20 రోజుల్లో పూర్తి కావస్తున్నా మంజూరైన పనుల్లో సగం కూడా పూర్తి చేయలేకపోయారు. జిల్లాకు 811 పనులు.. రూ.54.28 కోట్లు మంజూరయ్యాయి. సకాలంలో నిధులు ఖర్చు చేయకపోతే వెనక్కు వెళ్లే ప్రమాదం ఉంది. గతేడాది కూడా వందశాతం లక్ష్యం చేరుకోలేకపోయారు. ఈ నెల చివరి నాటికి పనులన్నీ ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్లకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

492 పనులు పూర్తి

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద ఎక్కువ శాతం సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు 75 శాతం మేర పనులను ప్రారంభించారు. ఇందులో 50 శాతం అంటే 492 పనులను పూర్తి చేశారు. మరో 50 శాతం పనులు పూర్తి చేయాల్సి ఉంది. వారం రోజుల్లో మిగిలిన పనులన్నింటినీ ప్రారంభించి 20 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది. సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో పనుల బాధ్యత అధికారులపైనే పడింది.

కార్యకర్తలకే పనుల బాధ్యతలు

ఉపాధి హామీ పథకం పనులు వందల్లో.. సమయం రోజుల్లో ఉండటంతో వాటిని ఎలా పూర్తి చేస్తారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. గడువులోగా పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుండటంతో క్షేత్రస్థాయి అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఎమ్మెల్యేల సూచనల మేరకు అధికారులు పార్టీ కార్యకర్తలకు పనులు అప్పగిస్తున్నారు. వీరికి అధికారికంగా ఏ బాధ్యతలు లేకపోవటంతో ఒత్తిడి చేయలేకపోతున్నారు. ఒకవేళ పనులు పూర్తి చేయాలని తొందరపెడితే నాణ్యత పాటిస్తారా అనే అనుమానం వ్యక్తమవుతోంది. గతేడాది కూడా ఇదే తరహాలో హడావుడి చేసినా చాలా వరకు పనులు మిగిలి పోయాయి. ప్రత్యేక అనుమతులు తీసుకొని పనులను పూర్తి చేయాల్సి వచ్చింది.

> **నాణ్యత విషయంలో రాజీ పడం**
>
> ఉపాధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సకాలంలో పూర్తయ్యేలా చూస్తాం. ఇప్పటికే చాలా పనులు పూర్తయ్యాయి. నాణ్యత విషయంలో రాజీ పడం . పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.
>
> – ఉమేశ్, పీఆర్ ఈఈ, వికారాబాద్

ఇసుక పర్మిట్లు రద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ తారాసింగ్

సాక్షి ఎఫెక్ట్

తాండూరు రూరల్: తాండూరు మండలంలో ఇసుక అక్రమ రవాణాపై మంగళవారం సాక్షి దినపత్రికలో అంగట్లో పర్మిట్లు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఖాంజాపూర్ వాగు నుంచి ఇసుక పర్మిట్లను రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. అలాగే పాత ప్రొసీడింగ్ కాపీలు చూపి ఇసుక అనుమతులు పొందిన ట్రాక్టర్ల యజమానులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఇసుక అక్రమ దందాపై స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరా తీశారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ విషయమై మంగళవారం తహసీల్దార్ తారాసింగ్ మీడియాతో మాట్లాడారు. పాత ప్రొసీడింగ్ కాపీలతో ఇసుక పర్మిషన్ పొందిన ట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచుతామని తెలిపారు. ఇకపై అభివృద్ధి పనులకు సంబంధించి ఇసుక పర్మిషన్లు ఇచ్చే సమయంలో తమ కార్యాలయ సిబ్బందితో విచారణ చేసిన తర్వాలే అనుమతులు ఇస్తామని తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేసిన ట్రాక్టర్ల (ఏపీ 07 టీహెచ్ 359 4,ఏపీ 28 డీడీ 6985,టీజీ 34 టీఆర్ 1913, టీఎస్ 15 యూఏ 8203,టీఎస్ 15 యూఏ 1435) యజమానులపై పోలీసులకు ఫి ర్యాదు చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా కొందరు చేసే పనుల కారణంగా పార్టీ, ప్రభుత్వం బద్నాం అవుతోందని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ల యజమానులు వారిపై కేసులు పెట్టకుండా రాజకీయ నాయకుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయండి

అబ్దుల్లాపూర్ మెట్: మామిడి సీజన్ దృష్ట్యా బాటసింగారంలోని పండ్ల మార్కెట్లో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని కోరుతూ గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు మంగళవారం రాచకొండ సీపీ జి. సుధీర్బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. మామిడి సీజన్ కావడంతో దిగుమతులు భారీగా ఉంటాయని, క్రయ విక్రయాలు, నగదు లావాదేవీలు అధికంగా జరుగుతాయని తెలిపారు. మార్కెట్లో చోరీలు జరిగే ఆస్కారం ఉందన్నారు. అంతే కాకుండా కొంత మంది బ్రోకర్లతో కుమ్మక్కై మార్కెట్ బయట వ్యాపారం చేస్తూ పండ్లు అక్రమంగా అమ్ముతున్నారని, మార్కెట్ ఆదాయానికి గండి పడుతోందని అన్నారు. ఇలాంటి వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరచారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు వన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేశ్ నాయక్, రఘుపతి రెడ్డి, దోమలపల్లి, అంజయ్య, వెంకటేశ్వర్లు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

‘యూడీఐడీ’లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం)కార్డు కోసం యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సదరం క్యాంపుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాల కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. క్యాంపుల వివరాలను మెసేజ్‌ల ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి వెంకటరవణ, డీసీహెచ్ఎస్ ప్రదీప్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, సూపరింటెండెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ సన్నిధిలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు కడ్తాల్ మండల కేంద్రంలో హుస్సేన్‌నాయక్‌కు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, జిల్లా నాయకులు రాందాస్‌నాయక్, భగీరథ్, శ్రీశైలంగౌడ్, కుమార్, మునేశ్, రెడ్యానాయక్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



మైసమ్మను దర్శించుకున్న హుస్సేన్ నాయక్

అసమానతలు లేని ఆర్థిక వ్యవస్థ కావాలి



తుక్కుగూడలో ర్యాలీ తీస్తున్న సీపీఐ నేతలు, కార్మికులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

తుక్కుగూడ: దేశంలో ఆర్థిక లేని వ్యవస్థ కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆపార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తుక్కుగూడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సెమినార్ నిర్వహించారు. అంతకు ముందు కార్మికులు, కర్షకులతో కలిసి ఔటర్ రింగు రోడ్డు హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుపేదల ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దిగజారిందన్నారు. ఇదే సమయంలో కార్పొరేట్ శక్తుల ఆదాయం వంద రెట్లు పెరిగిందని ఆరోపించారు. దేశంలో జీఎస్టీ వసూలు పేరుతో పేదలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఖనిజ సంపదను పూర్తిగా బడా కంపెనీలకు దోచి పెడుతున్నారన్నారు. మతతత్వ బీజేపీపై పోరాడేందుకే తాము కాంగ్రెస్ పార్టీతో జత కట్టామని స్పష్టంచేశారు. దేశంలోని నిరుపేదలు, కార్మికులు, కర్షకుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని వెల్లడించారు. ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామికవాదులు, కవులు, కళాకారులపై దాడులు, హత్యలు జరుగుతునయన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకులు జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, యాదిరెడ్డి, దత్తు నాయక్, నర్సింహ్మా, యాదయ్య, పార్టీ శ్రేణులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఏఆర్టీ ప్రతినిధి డాక్టర్ సమీవుల్లా

ఏఆర్టీ ప్రతినిధి డాక్టర్ సమీవుల్లా

తాండూరు టౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమని, వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఆర్టీ ప్రతినిధి డాక్టర్ సమీవుల్లా అన్నారు. మంగళవారం సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తాండూరు పరిధిలోని ఐకేపీ, మెప్మా, డ్వాక్రా సహాయ సంఘాల మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి బీపీ, షుగర్, టీబీ వంటి వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ఒత్తిడి కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఏడాదిలో రెండు సార్లయినా పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఏదైనా వ్యాధి బారిన పడితే వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఆనంద్‌గోపాల్, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమీవుల్లా, మెప్మా అధికారి రాజేంద్రప్రసాద్, ఐసీఎస్ కృష్ణవేణి, కౌన్సిలర్ పర్వతాలు, ఓఆర్‌డబ్ల్యూ ప్రకాష్, అనంతప్ప, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్



మాట్లాడుతున్న న్యాయమూర్తి డీబీ శీతల్

అనంతగిరి: చట్టాలపై యువతీ యువకులకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని తక్షశిల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో పయనించాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. కష్టపడితే ఏదైన సాధ్యమన్నారు. ర్యాష్ డ్రైవ్ చేసి ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు. సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేష్, శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ భూమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాగితాల్లోనే కళాశాల

- మూడు నెలల క్రితమే ఉపాధ్యాయ శిక్షణ తరగతులు ప్రారంభం
- బోధన చేయకుండానే శిక్షణ ఇస్తున్నట్లు ప్రచారం
- ఇదీ యాలాల మండలంలో డైట్ కళాశాల పరిస్థితి

వికారాబాద్: పై ఫొటోలో కనిపిస్తున్న భవనం యాలాల మండలం తిమ్మాయిపల్లి గ్రామ శివారులోని డైట్ కళాశాల. రికార్డుల్లో మాత్రం ఇక్కడ డైట్ మొదటి, రెండో సంవత్సరం తరగతులు కొనసాగుతున్నట్లు లెక్క. గత ఏడాది ఈ కళాశాలలో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు ప్రస్తుతం సెకెండ్ ఇయర్‌లో ఉండగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 50 మంది ఛాత్రోపాధ్యాయులు అడ్మిషన్ తీసుకున్నట్టు రికార్డుల్లో ఉంది. మూడు నెలలుగా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఒక్క రోజు కూడా క్లాసులు జరిగిన దాఖలాలు లేవు. ఇంకా చెప్పాలంటే కళాశాల గేటుకు తాళం తీసింది కూడా లేదు. ప్రస్తుతం బిల్డింగ్ మొత్తం బూజు, దుమ్ము, ధూళి, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డైట్ కళాశాలకు అనుమతులు పొందాలంటే నిర్వాహకులు రూ.12 లక్షల ఎఫ్‌డీలు సమర్పించాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ లేకుండానే పర్మిషన్ ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ఓ సామాజిక కార్యకర్త ఎస్‌ఈఆర్టీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణకు ఆదేశించారు. విషయం డైట్ కళాశాల నిర్వాహకులకు తెలియడంతో శుక్రవారం వారు కాలేజీకి చేరుకొని పిచ్చి మొక్కలను తొలగించారు. తరగతి గదులను శుభ్రం చేశారు. రెండు మూడు రోజుల్లో అధికారులు విచారణకు వచ్చే అవకాశం ఉండటంతో విద్యార్థులను కూడా తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

> **ప్రిన్సిపాల్ సూచనల మేరకే రిపోర్టు ఇచ్చాం**
>
> ఈ విషయమై వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. జిల్లాలో ప్రైవేటు డైట్ కళాశాలల ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యుడు రామ్‌రెడ్డిని వివరణ కోరగా.. తాను యాలాల మండలం తిమ్మాయిపల్లి గ్రామ శివారులోని డైట్ కళాశాలను తనిఖీ చేసి రిపోర్టు ఇచ్చిన మాట వాస్తవమే. కానీ ఆ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి సూచనల మేరకే రిపోర్టు ఇచ్చాం అని తెలిపారు.

శిక్షణ పొందకుండానే సర్టిఫికెట్లు

జిల్లాలో ఉపాధ్యాయ శిక్షణ రికార్డులకే పరిమితమైంది. ఎలాంటి తరగతులు నిర్వహించకుండానే ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు డైట్ కళాశాలల నిర్వాహకులతో కుమ్మక్కై విద్యార్థులు లేకున్నా ఉన్నట్లు రిపోర్టులు ఇస్తున్నారు. అంతేకాకుండా పాడుబడిన భవనంలో కళాశాలను నిర్వహిస్తున్నారు. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కళాశాల ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండి విష సర్పాలకు నిలియంగా మారింది. ఇక తరగతి గదుల విషయానికి వస్తే గోడలకు పగుళ్లు.. బూజు పట్టి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 8 డైట్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఒకటి ప్రభుత్వ కళాశాల కాగా ఏడు ప్రైవేట్‌వి. వీటిలో సమారు వెయ్యి మంది విద్యార్థులు ఉపాధ్యాయ శిక్షణ తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న వికారాబాద్ డైట్ కళాశాల నిర్వహణ కాస్త మెరుగ్గా ఉండగా ప్రైవేట్ కళాశాలల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది.



యాలాల మండలం తిమ్మాయిపల్లిలో శిథిల భవనంలో డైట్ కళాశాల

> **కఠిన చర్యలు తీసుకోవాలి**
>
> 
>
> అడ్మిషన్లు తీసుకొని తరగతులు నిర్వహించని యాలాల మండలంలోని డైట్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు లేకున్నా ఉన్నట్లు రిపోర్ట్ ఇచ్చిన అధికారులపై వేటు వేయాలి. కళాశాల నిర్వహించడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. విద్యార్థులు నష్టపోకుండా వారిని వేరే కళాశాలకు షిఫ్ట్ చేయాలి.
>
> – దిడ్డికాడి గోపాల్, సామాజిక కార్యకర్త

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: మండలంలోని చించల్ పేట గ్రామంలో ఊరడమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, నాయకులు అశోక్, శంకరయ్య, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు



రాజుకుంటున్న నిప్పు

దుద్యాల్: మండల పరిధిలోని రోటిబండ తండా సమీపంలోని అడవికి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టారు. లగచర్ల నుంచి రోటిబండ తండాకు వెళ్తున్న మార్గంలో పల్లె ప్రకృతివనం దగ్గరలోని పొలాలను అనుకుని సాధారణ అడవి ఉంది. పంటల కాలం పూర్తవ్వడంతో పంటల వ్యర్థాలు, పిచ్చిగడ్డి పూర్తిగా ఎండిపోయింది. దీంతో అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్గి రాజుకుంది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ప్రజలు నిస్తూరంగా చూస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సంబంధిత అధికారులు అడవులపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కుల్కచర్ల: తాళం వేసిన ఇంట్లో చోరీ చేసిన ఘటన కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల గ్రామానికి చెందిన అమీనా బేగం నగరంలోని ఉప్పల్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. గ్రామానికి వచ్చిన ఆమె ఈ నెల 10న ఉప్పల్‌లో రంజాన్ కానుకగా కుట్టు మిషన్లు ఇస్తున్నారని తెలిసి ఈ నెల 9న కూతురు ఆసియాను తీసుకొని నగరానికి వెళ్లింది. అయితే కుట్టు మిషన్ల పంపిణీ వాయిదా పడటంతో కూతుర్ని 10వ తేదీ కుల్కచర్లకు పంపింది. ఆసియా గ్రామానికి వచ్చి చూడగా ఇంటి, బీరువా తాళాలు పగులగొట్టినట్లు గుర్తించి తల్లికి ఫోన్ ద్వారా తెలియజేసింది. మంగళవారం అమీనా బేగం గ్రామానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటిలో ఉన్న తులం బంగారం, 20 తులాల వెండి చోరీకి గురైనట్లు ఫిర్యాదు పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న కలప లారీ సీజ్



కలప లారీని సీజ్ చేసిన ఫారెస్ట్ అధికారులు

దోమ: అక్రమంగా తరలిస్తున్న కలప లారీని ఫారెస్ట్ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం దోమ మండల పరిధిలోని గుండాల గ్రామ సమీపంలో కొందరు వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కలప తరలిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు ఘటన స్థలానికి వెళ్లిన ఫారెస్ట్ అధికారులు లారీకి సంబంధించిన పత్రాలను సమర్పించాలని కోరారు. ఈ క్రమంలో వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల సెక్షన్ ఆఫీసర్ మైనోద్దీన్, బీట్ ఆఫీసర్ భీమ్లా, సిబ్బంది బాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

- అర్హులందరికీ మంజూరు చేస్తాం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో నియోజవకర్గంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి అర్హుల జాబితాను కమిటీ సభ్యులు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎవరికి ఇల్లు అవసరం అనేది గ్రామ స్థాయి నాయకులకు, కమిటీ సభ్యులకే తెలుస్తుందన్నారు. కాబట్టి అట్టడుగు వర్గాల పేదలకు ఇళ్లను మంజూరు చేయాలని సూచించారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. కాని సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారన్నారు. త్వరలోనే రేషన్ కార్డులను మంజూరు చేస్తామని ఉగాది పండుగ నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

నియోజకవర్గంలో రూ.340 కోట్లతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగి నుంచి వికారాబాద్‌కు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి రూ.120 కోట్లు, పరిగి షాద్‌నగర్ వరకు నాలుగు లైన్లకు రూ.120 కోట్లు, గడిసింగాపూర్ నుంచి రంగారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డుకు రూ.100 కోట్లు మంజూరయ్యాయని, ఆయా పనులకు శంకుస్థాపన చేశామన్నారు. పరిగి పట్టణ కేంద్రంలో కొత్తచెరువు పుననిర్మాణానికి రూ. 29లక్షలతో పనులను ప్రారంభించామన్నారు. కొత్త చెరువు పనులు పూర్తవగానే పరిగికి మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పరిగిని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తను అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పరిగి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్లు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, దోమ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆయ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

పరిగిని రెవెన్యూ డివిజన్ చేయాలి

- టీ జేఏసీ జిల్లా చైర్మన్ ముకుందనాగేశ్వర్

పరిగి: పరిగి నియోజవర్గాన్ని నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని టీజేఏసీ జిల్లా చైర్మన్ ముకుందనాగేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఆయా మండలాల టీజేఏసీ, నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పరిపాలన సౌలభ్యం కోసం అవకాశం ఉన్న గ్రామాలను కలిపి నూతన మండలాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పూడూర్ మండలంలో కంకల్, దోమలో దాదాపూర్, దిర్సంపల్లి, గండ్వీడ్ మండలంలో వెన్నచేడ్, చౌడాపూర్‌లో మరికల్ గ్రామాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాక నియోజకవర్గంలోని చాలా గ్రామాలు అనుబంధ గ్రామాలుగా ఉండి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఎన్నికల్లో పరిగి అభివృద్ధికి ఇచ్చిన హామీలను వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, ప్రజా సంఘాల నాయకులు గోపాల్‌రెడ్డి, గోవింద్‌నాయక్, భానుప్రకాశ్, రవీందర్, వెంకట్‌రాములు, కృష్ణయ్య, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పరిశీలన



హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న మమత

కొడంగల్ రూరల్: జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ టీమ్ జైన్ డైట్ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ మమత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీ చేపట్టిన అధ్యయనం జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజులపాటు సర్వే కొనసాగుతుందన్నారు. లోపాలను గుర్తిస్తూ ప్రణాళికల రూపకల్పనకు సర్వే వేదికవుతుందన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తూ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ పుస్తకాలను చదవడం, రాయడం, అక్షరాలు, అంకెలు గుర్తించడం, అవగాహన తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటారన్నారు. 10వ తేదీన తెలుగు, 11న ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించిన సర్వే పూర్తయ్యిందని తెలిపారు. 12వ తేదీన గణితం సబ్జెక్టుకు సంబంధించి సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం క్రాంతికుమార్ పాల్గొన్నారు.

తెలియని లింక్‌లు ఓపెన్ చేయొద్దు

- రిజర్వు బ్యాంకు అధికారులు సావిత్రి, రెహమాన్
- తులేకలాన్‌లో డిజిటల్ చెల్లింపులపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న రిజర్వు బ్యాంకు అధికారి సావిత్రి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆఫర్ల పేరుతో ఆన్‌లైన్‌లో వచ్చే తెలియని లింక్‌లని ఓపెన్ చేసి మోసపోవద్దని భారతీయ రిజర్వు బ్యాంకు అధికారులు ఎ.సావిత్రి, ఎ.రెహమాన్ సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని తులేకలాన్ గ్రామంలో డిజిటల్ లావాదేవిలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిజర్వు బ్యాంకు అధికారులు హాజరై మాట్లాడుతూ.. అపరిచిత లింక్‌లు కలిగి ఉన్న ఎస్ఎంఎస్, ఈమెయిల్‌ని వెంటనే డిలిట్ చేయాలన్నారు. ఆర్థిక వివరాల ధ్రువీకరణ కోరే వెబ్‌సైట్‌ను నిర్ధారించుకోవాలన్నారు. వ్యక్తిగత వివరాలని లేదా బ్యాంకు సమాచారాన్ని సోషల్ మీడియాలో పంచుకోవద్దని సూచించారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయడంతో మీ బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుందన్నారు. డబ్బులు అడిగే అపరిచిత వ్యక్తుల కాల్స్, ఈమెయిల్స్‌లకి సమాధానం ఇవ్వొద్దన్నారు. పెద్ద మొత్తంలో రాబడుల ఆశ చూపేవారి వెబ్‌సైట్స్ యాప్‌ల వివరాలని తనిఖీ చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేసే సమయంలో స్క్రీన్‌పై పేరు సరి చూసుకోలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్(ఆపరేషన్స్) మురళీకృష్ణ, అధికారులు సుధాకర్, బాలవెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులు క్రమశిక్షణతో మెలగాలి

- ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్
- టీయూడబ్ల్యూజే జిల్లా ద్వితీయ మహాసభలు



సభలో ప్రసంగిస్తున్న అమర్

శంకర్‌పల్లి: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాత్రికేయులు సైతం క్రమశిక్షణతో మెలగాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ) మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, ఐజేయూ ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో టీయూడబ్ల్యూజే జిల్లా ద్వితీయ మహాసభలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. ఈ జర్నలిస్ట్ యూనియన్ 1957లో ప్రారంభించారని, ప్రస్తుతం ఎన్ని కొత్త యూనియన్లు వచ్చినా.. పద్ధతి ప్రకారం నడిచేది టీయూడబ్ల్యూజే మాత్రమేనని స్పష్టం చేశారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కల్గిస్తోందని, యూనియన్ల ప్రతిష్ఠను దిగజార్చుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు హామీలు ఇవ్వడం తప్ప.. అమలు చేసింది లేదన్నారు. బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులతో తనకు అనుబంధముందని, ఇదే ధోరణిని ముున్ముందు కొనసాగిస్తానని తెలిపారు. అనంతరం వివిధ ప్రతికల్లో 25 ఏళ్లకు పైగా సేవలందించిన పాత్రికేయులందరికీ టీయూడబ్ల్యూజే తరఫున సన్మానించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సలీం పాషా పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా సలీం పాషా



టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌పల్లి పట్టణానికి చెందిన ఎండీ.సలీం పాషా, ప్రధాన కార్యదర్శిగా మేకల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా ద్వితీయ మహాసభల్లో ప్రకటించారు. జర్నలిస్టు నాయకులు సలీంకు శుభాకాంక్షలు తెలిపారు. ఇది వరకు అధ్యక్షుడిగా పని చేసిన శ్రీకాంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



బంజారా హిల్స్: పంజాగుట్ట చౌరస్తా నుంచి అమీర్‌పేట వరకు రోడ్డుకు రెండువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు, డబ్బాలను పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్‌లో భాగంగా మంగళవారం తొలగించారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ పర్యవేక్షణలో పంజాగుట్ట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయగా..ట్రాఫిక్ పోలీసులు సుమారు 70 ఆక్రమణలను ఈ సందర్భంగా తొలగించారు. దీంతో పాదచారులు, వాహనదారులు తేలికగా ముందుకు సాగడానికి అవకాశం ఏర్పడింది. గత కొన్నాళ్లుగా పంజాగుట్ట-అమీర్‌పేట రోడ్డుకు రెండు వైపులా ఫుట్‌పాతల ఆక్రమణలతో రోడ్డు కుదించుకుపోయింది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ఫిర్యాదులు అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వీటిని తొలగించారు.



మోమిన్‌పేట: స్వామి వారి కల్యాణానికి హాజరైన మహిళ భక్తులు



మోమిన్‌పేట: వెల్‌చాల్ లక్ష్మీ నరసింహాస్వామి కల్యాణ మహోత్సవం

కల్యాణం.. కమనీయం

- ఘనంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం
- హాజరైన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు



పరిగి: స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు తదితరులు

పరిగి: పట్టణంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వస్వామి దేవాలయ 38వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపారాయణం, అభిషేకం, హోమాలు నిర్వహించి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ఆయా మండలాల భక్తులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. దేవాలయం నుంచి పురవీధుల గుండా ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ఆయ గ్రామాల నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వెల్‌చాల్‌లో లక్ష్మీ నరసింహాస్వామి..

మోమిన్‌పేట: వెల్‌చాల్ లక్ష్మీ నరసింహాస్వామి కల్యాణం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామి కల్యాణం నిర్వహించారు. వేద మంత్రాలు పఠిస్తూ లక్ష్మీ సమేతంగా కల్యాణ మండపానికి స్వామి వారిని తీసుకువచ్చారు. ఉత్సవ మూర్తులకు మధ్యాహ్నం కల్యాణం జరిపించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి అక్షింతలు వేశారు. అనంతరం స్వామి వారికి మహిళ భక్తులు మంగళహారతులిచ్చారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, గ్రామ పెద్దలు ఎం విఠల్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కృష్ణయ్య ఇప్పాయిపల్లి నుంచి కుల్కచర్ల వైపు వస్తున్నారు. కుస్మసముద్రం గ్రామానికి చెందిన చెన్నకేశవులు(19), రమేష్ కుల్కచర్ల నుంచి ఎరువుల బస్తాలు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో తిర్మలాపూర్ గ్రామ శివారులో రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. తీవ్రంగా గాయపడిన చెన్నకేశవులును 108లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేష్, ఉపాధ్యాయుడు కృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంతూరికి వెళ్లొచ్చే సరికే..

ఇంటి తాళాలు పగులుగొట్టి బంగారం, వెండి ఆభరణాల చోరీ

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంటి తాళాలు ధ్వంసం చేసిన దుండగులు బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు, నగదును అపహరించుకుపోయిన సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అంజిరెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని కవాడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఉదయ్ గార్డెన్ కాలనీలో నీరుడు సతీష్ కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నాడు. ఆయన సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి స్వగ్రామమైన యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జూలూరులో జరిగే జాతరకు వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు ధ్వంసం చేసి లోపలి ప్రవేశించినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న 4 తులాల బంగారం, 80 తులాల వెండి వస్తువులు, నగదు దొంగిలించినట్లు నిర్ధారించుకున్నాడు. దాదాపు రూ.6.5 లక్షల విలువగల సొత్తును తస్కరించారని సతీష్ విలపించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల ఇంటికి వెళ్లి దారితప్పిన మహిళ

- ఉపాధి కూలీల సమాచారంతో ఇంటికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు



ఇందిరమ్మ

తాండూరు రూరల్: బంధువుల ఇంటికి వెళ్లిన ఓ మహిళ దారి తప్పిపోయింది. అటవీ ప్రాంతాంలో చిక్కుకోవడంతో ఉపాధి కూలీలు గుర్తించారు. ఆమె వివరాలు తెలుసుకుని గ్రామస్తులకు తెలపడంతో క్షేమంగా ఇంటికి చేరుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..తాండూరు మండలం చెన్‌గేస్‌పూర్ అనుబంధ గ్రామం కోనాపూర్‌కు చెందిన మాల ఇందిరమ్మ చెంగోల్‌లోని బంధువుల ఇంటికి సోమవారం వెళ్లింది. తిరిగి బైపాస్‌రోడ్డు నుంచి గౌతపూర్ చౌరస్తాకు వెళ్లి అక్కడి నుంచి ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఒంటరిగా వెళ్తున్న ఇందిరమ్మ దారి తప్పింది. గోట్లపల్లి అటవీప్రాంతంలో చిక్కుకుంది. అంతారం గ్రామ ఉపాధి కూలీలు ఆమెను గుర్తించి వివరాలు సేకరించారు. ఆమె చెప్పిన వివరాల ప్రకారం కోనాపూర్ గ్రామస్తులకు సమాచారం చేరవేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు వచ్చి ఇందిరమ్మను కోనాపూర్‌కు తీసుకెళ్లారు.

గ్రూప్ ఫలితాల విడుదల సరికాదు



దీక్ష చేపట్టిన నాయకులు

- ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహా

షాద్‌నగర్: ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యే వరకు గ్రూప్ పరీక్షల ఫలితాలను నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో నిరాహార దీక్ష చేపట్టారు. రెండో రోజు మంగళవారం దీక్షా శిబిరానికి విచ్చేసిన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ అంశంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయకుండానే ప్రభుత్వం గ్రూప్ ఫలితాలను విడుదల చేయడం సరికాదన్నారు. లోపాలను సవరించకుండా ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉద్యోగాల నియామకాలకు నోటిఫికేషన్లు జారీ చేయడం తగదన్నారు. దీంతో మాదిగ, మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అయ్యేంత వరకు ఉద్యోగ నియామకాలు ఆపాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రావణ్, నాగభూషణ్, సురేష్, పాండు, మహేందర్, సుదర్శన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

చార్మినార్: గంజాయి రవాణాతో పాటు విక్రయాలు జరుపుతున్న ముగ్గురు అంతర్రాష్ట స్మగ్లర్లను సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.11 లక్షల 30 వేలు విలువ చేసే 30.70 కేజీల ఎండు గంజాయి, 3 మొబైల్ ఫోన్లు , 2 ట్రాలీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డిప్యూటీ కమిషనర్ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముర్గీచౌక్‌లో మహమ్మద్ యాసిన్ ఇంటిపై హుస్సేనీ ఆలం పోలీసులతో కలిసి సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి 30.70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాంపూర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ యాసిన్ సిటీకి బతుకుదెరువు కోసం వచ్చి ముర్గీచౌక్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అధికంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఒడిశాకు చెందిన గోపాల్ ఖరా, ఉత్తమ్ తామెల్‌తో కలిసి గంజాయి వ్యాపారం ప్రారంభించారు. కొద్దిరోజుల క్రితం యాసీన్ ఒడిశాకు వెళ్లి అక్కడ గోపాల్, ఉత్తమ్‌ల సాయంతో 30 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. వారితో పాటు హైదరాబాద్‌కు తిరిగి వచ్చాడు. ధూల్‌పేటలోని కస్టమర్‌కు గంజాయి అందజేయడం కోసం నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.